మహబూబ్‌నగర్
వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

### ఆర్అండ్ఆర్ పనులు

# వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు అర్అర్‌కింద కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోనిమినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామ గడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రం లో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని పనులను వేగాంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఏ.నరసింహా రెడ్డి, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

### మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో

# ముందుంచుతాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- రూ.1.21కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై22, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం మహబూబ్ నగర్ కార్పోరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. భూలక్ష్మి కాలనీలో పబ్లిక్ హెల్త్ నిధుల ద్వారా 46 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు.ముడా నిధుల ద్వారా శ్రీనివాసకాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో రూ.10లక్షలతో నిర్మించనున్న షెడ్ నిర్మాణపు పనులకు, వేంకటేశ్వర కాలనీ లోని హాయగ్రీవ టెంపుల్ దగ్గర గల పార్క్‌ను రూ.10 లక్షలతో నిర్మించనున్న పనులకు, గొర్రెకాపరుల సంఘం భవనం ఆవరణలో రూ.30లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముడా నిధులు ద్వారా, ఏనుగొండలోని రామదూత టౌన్షిప్ కాలనీలో 25లక్షల రూపాయలతో నిర్మించనున్న అధునాతన పార్క్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు సిజే బెనహార్, వెంకటేష్ గౌడ్, రామస్వామి, కిరణ్ కుమార్, ఇమ్మడి పురుషోత్తం, సిహెచ్ మంజుల, సిహెచ్ జ్యోతి, రఘురామిరెడ్డి, మురళీ గౌడ్, వెంకటయ్య , రమేష్, సిఎంఓ బాలు యాదవ్, రవికుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువత వృత్తివిద్య కోర్సులను

# సద్వినియోగం చేసుకోవాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి రూరల్, జూలై 22 ప్రభాతవార్త:** యువతకు టాటా కన్సల్టెన్సీ ద్వారా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు ఇచ్చే వృత్తి విద్యా కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం వనపర్తి మండలం నాగవరం వద్ద ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టి.ఐ) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన యువతకు ఆయా రంగాల్లో ఆధునిక వృత్తి శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నుండి టాటా కన్సల్టెన్సీ తో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా టాటా కన్సల్టెన్సీ వారు ఆధునిక యంత్రాలు, పరికరాలతో అడ్వాన్స్ శిక్షణ కేంద్రాన్ని (ఎటిసి) ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కోపా, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ వంటి కోర్సులతో పాటు ఆధునిక రోబోటిక్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఆర్టిసిజమ్, అడ్వాన్డ్ మెషీనింగ్ టెక్నీషియన్ వంటి మొత్తం 10 కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు సైతం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు.వారం రోజుల్లో కొత్తగా ఐటిఐ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రంలో జరుగుచున్న తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. నూతన భవనం త్వరగా పూర్తి చేసి వచ్చే నెలలో - మిగతా2లో..

## జూరాల 3గేట్ల ద్వారా నీటి విడుదల



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త :** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. జలాశయానికి 62,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.477 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 36506 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 12024 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1250 క్యూసెక్కులు, కుడి కాలువకు 645 క్యూసె క్కులు, సమాంతర కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 52286 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# రేషన్ కార్డు

## 48 గంటలో

# ఇప్పిస్తాం

- పేదోడి ఆత్మగౌరవం ప్రతీక రేషన్ కార్డు
- రూ.1.50 కోట్లతో పాఠశాల భవనం ఏర్పాటు చేస్తాం
- అవినీతి మచ్చలేని నాయకుడు పాండురంగారెడ్డి
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



లబ్దిదారులకు రేషన్ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



నూతన బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వంగూరు, జూలై 22 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ప్రజలకు రేషన్ కార్డును అందించి రేషన్ షాపులలో సన్నబియ్యాన్ని సరఫరా చేసి 3 పూటల భోజనాన్ని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి అర్హత కలిగిన పౌరులకు రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం వంగూరు మండలం మిట్ట సదగోడు గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ శక్తి మహిళా సంబురాలు, రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిట్టసదగోడు గ్రామ నివాసి కీర్తిశేషులు మంద పాండురంగా రెడ్డిని స్మరించుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిట్ట సదగోడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు పాండురంగారెడ్డి ఎంతో కృషి చేశారని, ఆ నాయకుడి కృషి వల్లనే 117 కొత్త రేషన్ కార్డులు, 53 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, మంజూరైన లబ్ధిదారులకు అందించే సమయంలో పేదల మనిషి లేకపోవడం బాధాకరమని ఆయన విచారణ వ్యక్తం చేశారు. ఆ నాయకుడు లేకపోయిన ఆయన ఆశయాలను కొనసాగించేందుకు పాండురంగారెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి పేద ప్రజలకు అండగా ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు చేస్తున్నారని హర్షిత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి పాండురంగారెడ్డి ఆశయ సాధనను కొనసాగించేందుకు అండగా ఉంటామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. మిట్టసదగుడు గ్రామంలో రూ.1.50కోట్ల నిధులతో నూతన పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేసేందుకు ఆనాడే హామీ ఇచ్చామని, పాఠశాల భవనాన్ని ఖచ్చితంగా ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే మరోసారి హామీ ఇచ్చారు. మరో 25 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని, దరఖాస్తు చేసుకున్న అర్హులకు 48 గంటల్లో కొత్త రేషన్ కార్డును అందిస్తామని ఆయన పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మాట తప్పని మడమతిప్పని ప్రభుత్వమని, పేద ప్రజల ఆత్మవిశ్వాసంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేదోడి ఆత్మగౌరవ ప్రతీక కొత్త రేషన్ కార్డులని, సన్నబియ్యం, రైతుకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ కల్పించి రైతన్నకు ఆసరాగా నిలిచిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ప్రయాణాన్ని ఉచితంగా అందిస్తున్నామని, పేదల ఇళ్లకు ఉచిత కరెంటును అందించి, లెక్కకు పైగా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కోనాపూర్ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించగా, రంగాపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. పోల్కంపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వంగూరు మండల కేంద్రం నుంచి వెలుమలపల్లి వెళ్లే రహదారిలో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కుడుముల సురేందర్ రెడ్డి, మంద హర్షిత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గం అధ్యక్షులు క్యామ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమోని రమేష్ గౌడ్, నాయకులు హరీష్ రెడ్డి, క్యామ పరశురాములు, సీనియర్ నాయకులు అల్వాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, హేమారెడ్డి, కృష్ణారెడ్డి, మనోహర్, మహేష్, శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, జనార్ధన్, గఫూర్, ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పథకాల అమలుపై కలెక్టర్లకు మంత్రుల ఆదేశాలు





మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు, జిల్లా అధికారులు

**గద్వాల టౌన్ జూలై 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ, సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఇబ్బంది కలగకుండా పూర్తి చర్యలు చేపడుతున్నామన్నారు. భూభారతిలో నమ్మోదైన దరఖాస్తులను నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వనమ హోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని కలెక్టర్ తెలియజే శారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ దీప్తి కలెక్టర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 883 అడుగులకు

# శ్రీశైలం జలాశయం

- ఒక గేటు ద్వారా నీటి విడుదల



శ్రీశైల నుంచి విడుదలవుతున్న వరద

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 22, ప్రభాతవార్త :** శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో రెండోసారి ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 37054 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 12518 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 39411 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 90,560 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 883.70అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 208.2841 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 67,185 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# వారంలో ఒక్కరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలి

- రాష్ట్ర మంత్రుల వీసీ కార్యక్రమంలో జిల్లా అధికారులు
- వివిధ అంశాలపై సమీక్ష జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు
- బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



విసిలో మాట్లాడుతున్న మంత్రులు



విసిలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

**నారాయణపేట ప్రతినిధి, జూలై 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు.

**సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం సరఫరా...**

ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల - మిగతా4లో..

## పీఏసీఎస్ గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్, జులై 22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ సింగిల్ విండో గోదాంను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న యూరియా బస్తాల నిల్వను పరిశీలించారు. ఇంతవరకు పీఏసీఎస్ ద్వారా ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారని ఆమె ప్రశ్నించగా, 54 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు వారి వారి పాస్ బుక్, ఎకరాలను బట్టి ఆధార్ కార్డు ద్వారా ఈ పాస్ మిషన్ ఆన్ లైన్ పద్ధతి ప్రకారం విక్రయించినట్లు కార్యాలయ అధికారి పళ్ళ అశోక్ కలెక్టర్ కు తెలిపారు. జిల్లా కేంద్రంలో పీఏసీఎస్ కేంద్రంతో పాటు రెండు ప్రైవేటు ఆగ్రో కేంద్రాల్లోనూ యూరియా విక్రయాలు జరుగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కలెక్టర్ కు తెలిపారు. మొత్తం జిల్లాలోని దామరగిద్ద, కోస్గి, మద్దూరు, గుండుమల్, ధన్వాడ, మరికల్, తీలేరు, నర్వ, ఊట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యూరియా విక్రయ కేంద్రాల వివరాలను జాన్ సుధాకర్ వివరించారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా ను రైతులకు విక్రయించినట్లు ఆయన వెల్లడించారు. అయితే మక్తల్ నియోజకవర్గంలోనే 2 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారని, అక్కడ వరి పంట సాగు ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇంకా ఆయా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. అయితే ఇతర వ్యాపారాలకు యూరియా వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయని, యూరియా పక్క దారి పట్టకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అలాగే సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల సహకారంతో వ్యవసాయ అధికారులతో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆమె జాన్ సుధాకర్‌ను ఆదేశించారు.


గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్

## బాధితుడికి లక్ష్మన్న భరోసా

**- గొర్రెల మందపై కుక్కలదాడి బాధితులకు చేయూత**

**- రూ.25వేల ఆర్థికసాయం అందజేత**

**జడ్చర్ల, జూలై22, ప్రభాతవార్త:** జడ్చర్ల మండలం తుపుదుగడ్డ చెందిన లష్కరియా నాయక్‌కి చెందిన గొర్రెల మందపై సోమవారం రాత్రి కుక్కలు దాడి చేసాయి. ఈ దాడిలో 30గొర్రెలు మృతి చెందగా, 20 గొర్రెలకు గాయాలయ్యాయి. సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డా.సి. లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి జీవనాధారంగా ఉన్న గొర్రెలు మృత్యువాత పడటంతో తీవ్ర దుఃఖంలో ఉన్న లష్కరియా నాయక్‌ను లక్ష్మారెడ్డి ఫోన్ లో పరామర్శించి ధైర్యం చెప్పారు. స్థానిక బిఆర్ఎస్ నేతల ద్వారా లష్కరియా నాయక్ కి రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, నాయకులు ఇంతియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

## జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షుడిగా బి.యాదగిరి

**కోయిలకొండ, జూలై 22 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్ర సంఘం సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని పశు గణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమావేశమయ్యింది. ఆ సంఘం సభ్యులు జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షుడిగా బి.యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్ గౌడ్‌ను, కోశాధికారిగా వెంకోజీ, ఉపాధ్యక్షులుగా ఖలీల్, రమేష్ గౌడ్, ముఖ్య సలహాదారుగా హాజీ, గౌరవ అధ్యక్షులుగా గిరిధర్ గౌడ్‌ను వీరితోపాటు మరి కొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్ను కోబడ్డ జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులు బి.యాదగిరి మాట్లాడుతూ గోపాలమిత్ర సమస్యల సాధన కొరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. గోపాల మిత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ముందుకు సాగుతానన్నారు. గోపాల మిత్రులంతా ఐక్యంగా ఉండి ముందుకు వెళ్లాలన్నారు. నాపై నమ్మకం ఉంచి నన్ను మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న మిత్రులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సంఘం నేతలు వీరయ్య, చెన్నయ్య, రామచంద్రయ్య, కురుమయ్య, రామకృష్ణ, ఉదయ్, ఫారుక్, సంగయ్య, దేవేందర్, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకున్న బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర, జూలై 22 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయాన్ని దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు, దేవరకద్ర బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ బోనాల పండుగ శుభ సందర్భంగా దేవరకద్ర మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవరకద్ర పోచమ్మతల్లి బోనాల పండుగ సందర్భంగా కొండప్రశాంత్ రెడ్డికి అమ్మవారి కండువా కప్పి, అమ్మవారి యొక్క నైవేద్యం ఇచ్చారు. ఈకార్యక్రమంలో దేవరకద్రమండల అధ్యక్షులు కృష్ణంరాజు, ఓబీసీ కార్యవర్గ సభ్యులు దేవన్నసాగర్, కొండావెంకటేశ్వర్‌రెడ్డి, కొండనాగిరెడ్డి, వెంకటేష్, కృష్ణయ్య, రాజు, నరేష్, వాకిటి అంజి, మహేష్, నరహరి, కురుమూర్తి, యూత్ అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

## భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి

**దామరగిద్ద, జూలై 22 ప్రభాతవార్త:** మక్తల్, నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కానుకుర్తి గ్రామరైతులు పంచాయతి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించుటకు బేసిక్ ధరను నిర్ణయించుటకు కమిషన్ ఏర్పాటు చేయాలని అట్టి బేసిక్ ధరకు 2013 భూ సేకరణ చట్టాన్ని అన్వయించి అమలు చేయాలని, అప్పటివరకు బలవంతంగా భూసేకరణ కార్యక్రమాన్ని నిలిపివేయాలని కోరారు. రైతులకు భూమికి భూమి లేదా న్యాయమైన పరిహారం ఇచ్చేవరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని ప్రభుత్వానికి తెలియపరుస్తున్నామన్నారు. మా విన్నపాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి తెలియజేయాలని కానుకుర్తి భూ నిర్వాసితుల సంఘం తరుపున వినతిపత్రం ద్వారా తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో మొగులప్ప, శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీహరిగౌడ్, నర్సిములు, శివకుమార్, అశోక్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

**మద్దూర్, జూలై 22 ప్రభాతవార్త:** మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ మంగళవారం మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్ల, మద్దూర్‌లో ఇందిరమ్మ మైనారిటీ మహిళాశక్తి స్కీం ద్వారా 2024 25 సంవత్సరంకుగాను మద్దూరు మున్సిపాలిటీకి 243 మిషన్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సింగిల్ విండో చైర్మన్ జి.నరసింహ పంపిణీ చేశారు . అనంతరం సింగిల్ విండో చైర్మన్ నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మహిళల కోసం ఎన్నో పథకాలు తీసుకోవస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అశోక్ గౌడ్, యాసీన్, జంగం బాబు, భారీ, అశోక్, పల్లె చెన్నారెడ్డి, రహీం, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందజేస్తున్న దృశ్యం

# మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల టౌన్, జూలై 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కేటీ దొడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యత్యులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే కె.టి దొడ్డి మండల లో యంగ్ ఇండియా పాఠశాల కు భూమి కార్యక్రమం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన నిరుపేద ప్రజలకు రేషన్ కార్డులు లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు సంబంధించిన రుణాల చెక్కులను మహిళలకు అందజేశారు. గతంలో ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారనీ, నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఈ మండలం అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేయడం జరిగిందనీ, ఈ ప్రాంత అభివృద్ధి కోసం సాగునీరు, రైతులకు అందించడం జరుగుతుందనీ, అదేవిధంగా విద్య వైద్య రంగ అభివృద్ధి కోసం కూడా కృషి చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలనీ, చదివించడం వల్ల మంచి బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుంది. రైతులకు రైతుబంధు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 200 యూనిట్లు కరెంటు ఉచితం, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ ఇలాంటి అనేకమైన వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటి రూపొందించి నిరుపేదలైన ప్రజలకు అందించడం జరుగుతుందనీ తెలిపారు. మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి జరుగుతుందన్నీ, ప్రతి గ్రామాలలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలనీ మహిళలు సంఘాల నుంచి వచ్చిన రుణాలతో మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, ప్రతి ఒక మహిళ మహిళా సంఘం లో వుంది ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోనీ కోటీశ్వర్లుగా ఎదగాలన్నారు. భవిష్యత్తులో కే.టి దొడ్డి మండల మరింత అభివృద్ధి కొరకు నా వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ , జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు ఉరుకుందు, చంద్రశేఖర్, వెంకన్న గౌడ్, యుగంధర్ గౌడ్ శేఖర్ రెడ్డి, రాజేష్, ఆంజనేయులు, తిక్కన్న, రంగారెడ్డి, భీమ రాయుడు, సత్యానారాయణ, వివిధ గ్రామాల నాయకులు, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, మహిళా సంఘం అధ్యక్షురాలు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా సంఘానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే


సమావేశానికి హాజరైన మహిళలు

## లెక్కల మాస్టర్‌గా మారిన కలెక్టర్ బాదావత్ సంతోష్

### పాఠశాల భవనాల పరిస్థితిపై సమీక్ష
### పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్

**బిజినేపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించి, లెక్కల మాస్టర్‌గా పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నంది వడ్డేమాన్ గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల తరగతి గదులను గ్రామంలోని మరో పాఠశాలకు మార్చేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ డీఈఓను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించి విద్యా ప్రమాణాలను పెంచాలని సూచించారు. పాఠశాలను భవనం స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదులు స్థితుల వ్యవస్థలో ఉంటే ఇదే గ్రామంలో ఉన్న మరో పాఠశాలకు తరగతి గదులను మార్పు చేయాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు. విద్యార్థుల భద్రత పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు ఉపాధ్యాయుల వివరాలు విద్యార్థుల రోజువారి హాజరు అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాల నిర్వహణ, శుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, పదవ తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరిశీలించారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థికి నోట్‌బుక్స్, యూనిఫాంలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంట గదిని పరిశీలించి, విద్యార్థులకు శుచి, శుభ్రతలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. కలెక్టర్ వెంట రాష్ట్ర ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి, నాగర్ కర్నూల్ డీఈఓ రమేష్ కుమార్, ఎంఈఓ రఘునాథ శర్మ, తాహసిల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలప్ప గ్రామస్తులు జగత్ చంద్రయ్య , న్యాయవాది వీరశేఖర్ ఆవుల రాములు రమేష్ లక్ష్మయ్య చంద్రశేఖర్ రెడ్డి రాజేష్ శెట్టి తదితరులు ఉన్నారు.


లెక్కల మాస్టారుగా మారిన జిల్లా కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం తప్పదు

**నారాయణపేట టౌన్, జూలై 22 ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్క్ దగ్గర కొనసాగుతున్న భూ నిర్వాసితుల దీక్ష మంగళవారంతో ఎనిమిదవ రోజుకు చేరుకుంది. దీక్షకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు మద్దతును తెలియజేశారు. అనంతరం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. ఈ జిల్లాకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరి స్పందించాలని బహిరంగ మార్కెట్ ధరలకనుగుణంగా న్యాయమైన పరిహారం అందించే విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. ముఖ్యమంత్రి కూడా తన సొంత నియోజకవర్గంలో లోని భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. రింగ్ రోడ్డుకు, నేషనల్ హైవేలకు ఖమ్మం , భువనగిరి, సంగారెడ్డి జిల్లాలో 50 లక్షలు 60 లక్షల మేర పరిహారం అందిస్తుంటే సీఎం సొంత నియోజకవర్గంలో కేవలం 14 లక్షలు పరిహారం అని ప్రకటించడం సరైంది కాదన్నారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందే వరకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ వారు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. రైతు తన ఇష్టంతో భూమిని అమ్ముకోవడం లేదని ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మాట ప్రకారమే భూమిని అమ్ముతున్నారని ఇలాంటి రైతుకు సరైన పరిహారం అందించి రైతును ఆనందంలో ఉంచాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు కన్నీళ్లు మిగిలించవద్దన్నారు. అదేవిధంగా టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసింహ, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి కెంచే నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేరపళ గ్రామం భూ నిర్వాసితులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు కాశీనాథ్

## స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి యంయస్‌పి చట్టం చేయాలి

**ఊట్కూర్, జూలై 22 ప్రభాతవార్త:** దేశంలో ప్రధానంగా 55 రైతంగం వ్యవసాయ రంగం పైన ఆధారపడి జీవిస్తున్నారని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి సలీం అన్నారు. మంగళవారం జరిగిన రైతు సంఘం మండల జనరల్ బాడీ సమావేశానికి ఆహ్వానితులుగా వచ్చిన ఆయన మాట్లాడుతూ. రైతు వ్యవసాయాన్ని నమ్ముకొని తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాంటి రైతు వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడి తిరిగి రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. పాలకవర్గాలు రైతే దేశానికి వెన్నెముక అని చెబుతున్నప్పటికీ రైతుని ఆదుకునే పరిస్థితి లేదు. వ్యవసాయ రంగాన్ని నమ్ముకున్న రైతు బతికే పరిస్థితి లేదని కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు భూమిని కట్టబెట్టి అలాగే కార్పొరేట్ వ్యవసాయం పేరుతో రైతులను కూలిగా మారుస్తున్నది గిట్టుబాటు లేక పంటకు పెట్టిన పెట్టుబడి రాదు. ప్రభుత్వాలు అంచనా ప్రకారం ఒక్క ఎకరా వరికి అయ్యే ఖర్చు 30000 పైన అవుతుంది. గిట్టుబాటు ధర లేక రైతు నష్టపోతున్నాడు. రోజు రోజుకు రైతు భూమి ని వదిలేసే దిశగా నేటి ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నారు .పెట్టుబడిదారులకు ఇచ్చినటువంటి రుణాలను మాపి చేసింది. దేశంలో ఉన్నటువంటి రైతులకు రుణమాఫీ చెయ్యనేలేదు. అందుకనే రైతు పక్షాన నిలబడి, రైతంగ సమస్యలకై నిరంతరం పోరాడాలని మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నప్ప హాజరయ్యారు. ఈ నూతన కమిటీకి అధ్యక్షులు చంద్రాములు, ఉపాధ్యక్షులు, బాబు, ఎల్.గోవిందు ప్రధాన కార్యదర్శి అంజప్ప, సహకార దర్శి నాగప్ప, చిన్నరాజు, కోశాధికారి బాలు మొత్తం 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశానికి పివైఎల్ జిల్లా కార్యదర్శి సిద్ధ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, పొర్ల నరసింహ మండలంలోనీ వివిధ గ్రామాల నుండి రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ డివిజన్ కార్యదర్శి సలీం

## మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### టిపిసిసి ఉపాధ్యక్షుడు డా. వంశీకృష్ణ

**ఉప్పునుంతల, జూలై 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మహిళలను కోటీశ్వరాలను చేయడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీశైలంహైదరాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న లత్తి పూర్ గ్రామపంచాయతీ శివార్లో ఉన్న కట్ట మైసమ్మ ప్రాంగణంలో శ్రీ దుర్గా భవాని ఆరె కటిక మహిళా సంఘం అచ్చంపేట వారి ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణం, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ కేంద్రాలను మహిళలకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు మహిళలకు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు బిజెపి నాయకులు మండికారి బాలాజీ, మహిళా సంఘాల అధ్యక్షురాలు, మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ


టిపిసిసి ఉపాధ్యక్షున్ని సన్మానిస్తున్న ఆరెకటిక మహిళలు

### ర్యాంకులు సాధించిన
## విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుకన్య

**జడ్చర్ల, జూలై22, ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల టిఎస్‌కేసి వారి ఆధ్వర్యంలో ఐసెట్ ప్రవేశ పరీక్ష నిమిత్తం నిర్వహించిన కోచింగ్ ద్వారా తృతీయ సంవత్సరం చదివిన విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించి ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి సుకన్య విద్యార్థులను అభినందించారు. ఎంబీఏ కోర్స్ నిర్విఘ్నకు 549 ర్యాంకును, భాను ప్రకాష్ 864, జస్వీర్ సింగ్ 1097, లక్ష్మీ ప్రసన్న 1735 ర్యాంకులను సాధించారు. కార్యక్రమానికి టీఎస్ కేసి కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ రాఘవేందర్ రెడ్డి, తెలుగు విభాగాధిపతి నరసింహులు హాజరయ్యారు. ఐసెట్ పరీక్షకి విద్యార్థులకు శిక్షణను అందించినందుకు టిఎస్‌కేసి మెంటర్ వీర ప్రతాప్ ను కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత విద్య వైపు తమ ప్రస్థానం కొనసాగించాలని తెలియచేశారు.

### ఎమ్మెల్యే చేతుల మీదుగా
## కొత్త రేషన్ కార్డుల పంపిణీ


కొత్త రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**ధన్వాడ, జూలై 22 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో మంగళవారం శ్రీ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మండలంలో గల వివిధ గ్రామాల ప్రజలందరికీ 520 కొత్త రేషన్ కార్డులో 1350 అడిషనల్ కార్డ్స్ మంజూరయ్యాయి. ఈ కార్డులను లబ్ధిదారులందరికీ ఎమ్మెల్యే పర్ణికరెడ్డి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డు అంటేనే ఆహార భద్రత అని అన్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం ఇవ్వడమే కాకుండా అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిన ఘనత అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జిల్లా మార్కెట్ చైర్మన్ సదాశివ రెడ్డి, తాసిల్దార్ సింధుజ, చిట్టెం మాధవ రెడ్డి, మండల అధ్యక్షుడు నరహరి, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు జట్రం లక్ష్మ గౌడు, శివకుమార్, చిట్టెం రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువత వృత్తివిద్య కోర్సులను
## సద్వినియోగం చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ప్రారంభోత్సవానికి సిద్ధం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. అనంతరం వై.టి.సి కేంద్రం (ప్రస్తుతం మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం) భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనానికి ఏమైనా మరమ్మతులు అవసరం ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం ఆవరణలో ఒక కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడిడి ఆర్డీఓ ఉమాదేవి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ బాబు, వనపర్తి తహసిల్దార్ రమేష్ రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పాఠశాలలకు చదరంగం (చెస్) బాక్సుల పంపిణీ



భూత్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెస్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

**భూత్పూర్, జూలై 22, ప్రభాతవార్త :** పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం పాలమూరు ఉమ్మడి జిల్లాల్లో చదువుకునే దాదాపు పాతిక మంది విద్యార్థులకు చదరంగం(చెస్) కిట్ బాక్సుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా పాలమూరు జిల్లా భూత్పూర్ మండలంలోని 52 ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు చెస్ కిట్స్‌ను మంగళవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ఫోరంకోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారిణి ఉషారాణి హాజరై విద్యార్థిని విద్యార్థులకు చెస్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కిట్స్‌ను పాఠశాలల్లో భద్రపరిచి అనునిత్యం డ్రిల్ పీరియడ్‌లో చెస్ ప్రాక్టీస్ చేయిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం ఆనందమ్మ, ఎంఈఓ ఉషారాణి తెలిపారు. ప్రతి ఇరవై మంది విద్యార్థిని విద్యార్థులకొక కిట్ చొప్పున భూత్పూర్‌కు 52పాఠశాలలకు 165కిట్స్‌ను మంజూరయ్యాయని తెలిపారు. ఎంఈఓ ఉషారాణి, హెచ్ఎం ఆనంద మ్మలతో పాటు సీఆర్‌పి ఇక్రమ్, ఇతర ఉపాధ్యాయులు రేవతి ఇతరపాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవి చంచల, సత్తూర్ లింగలగౌడ్, యాదయ్య, కడప వెంకటనారాయణ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీయుడబ్ల్యూజే జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

◆ వీపనగండ్ల మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముంత కృష్ణయ్య యాదవ్

**వీపనగండ్ల జులై22, ప్రభాతవార్త:** బుధవారం నాడుజరుగు వనపర్తి జిల్లా టీయుడబ్ల్యూజే (ఐజేయు) తృతీయ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వీపనగండ్ల మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముంత కృష్ణయ్యయాదవ్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న టీయుడబ్ల్యూజే యూనియన్ పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రతి సమస్యలపై గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి జర్నలిస్టులకు కావలసిన విద్య, వైద్యం, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలపై మొదటి నుంచి కొట్లాడి ఇప్పించిన ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే అని చెప్పారు. వనపర్తి మండలం చిట్యాల వద్ద దేశినేని పంక్షన్‌హాల్లో 23న బుధవారం జరగనున్న తృతీయ జిల్లా సభలకు ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, ఐజేయు స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి వస్తున్నారని, టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరు మహాసభలకు హాజరైవిజయవంతం చేయాలని కోరారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి సీపీఎం అగ్రనేత అచ్చుతానందన్‌కు ఘన నివాళి

**దామరగిద్ద, జూలై 22 ప్రభాతవార్త:** సీపీఎం వ్యవస్థాపకుల్లో ఒకరు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్చుతానందన్ కు దామరగిద్ద మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ మాట్లాడుతూ అయన ఏడు దఫాలు ఎమ్మెల్యేగా అసెంబ్లీ లో ప్రతిపక్ష నాయకులుగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీపీఎం పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన సీపీఎం అగ్రనేత మరణించడం సీపీఎం పార్టీకే కాదు దేశంలో ఉన్న వామపక్ష ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అయన జీవితకాలం మొత్తం పేదల కార్మికుల రైతుల పక్షాన నిలబడి పోరాడిన యోధుడుఅని అన్నారు. అచ్చుతానందన్ ఆశయసాధనను సీపీఎం శ్రేణులు ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్, నాయకులు, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, జోషి, మహేష్, నర్సప్ప, భీంసేన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత

**నారాయణ పేట, జూలై 22 ప్రభాతవార్త :** మంగళవారం లయన్స్ క్లబ్ నారాయణపేట టౌన్ అధ్యక్షుడు లయన్ కోన వెంకటేష్ జన్మదినం సందర్భంగా మండలం పరిధిలోని అప్పిరెడ్డి పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ టౌన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించారు. నేటి విద్యార్థులు భావితరాల మార్గ దర్శకులని చదువు తోపాటు ఆట పాటలను స్ఫూర్తిగా తీసుకొని దేశ సంస్కృతి సాంప్రదాయాన్ని కాపాడాలని లయన్ కృపాకర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, రామాంజనేయులు, మహేష్ కుమార్, కార్యదర్శి వెంకటేష్ సంజీవ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ కోన వెంకటేష్ కి క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం.. తల్లి బిడ్డ క్షేమం

**నారాయణ పేట, జూలై 22 ప్రభాతవార్త :** నారాయణపేట మండల పరిధిలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొగు లమ్మకు మంగళవారం రోజు తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడం తో 108కి సమాచారం ఇచ్చారు హుటా హుటిన అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ లో మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటి శిరీష, ఫైలెట్ మాణికప్ప సకాలంలో తగిన చర్యలు తీసు కొని తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు.

## ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపిన బికేఎస్ నాయకులు

**నారాయణపేట టౌన్, జూలై22 ప్రభాతవార్త:** రైతు పక్షపాతి ఎంపీ డీకే అరుణయని మంగళవారం ఓ ప్రకట నలో బికేఎస్ రాష్ట్ర నాయకులు వెంకోబా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నారా యణపేట జిల్లాను కరువు ప్రాంతం ప్రకటించిన సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కేంద్రంఈ సంవత్సరం అతివృష్టి వల్ల దేశంలోనే 100 జిల్లాల్లో నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఉండడం వల్లకేంద్ర ప్రభుత్వం సర్వే చేసిన సందర్భంగా అందులో నారాయణపేట పేరు ఉండడం వంద కోట్లు రూపాయలు పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ మంజూరు చేయించిన సందర్భంగా భారతీయ కిసాన్ సంఘమ్ నారాయణపేట జిల్లా తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాంతరైతు పక్షపాతి ఎంపీ డీకే అరుణ రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని కరువు, వెనకబడిన ప్రాంతమైన నారాయణపేట ఈ ప్రాంతంలో కరువు వస్తే వలసలు విపరీతంగా ఇతర రాష్ట్రాలకు రైతులు వలస పోతుంటారు. వారికి ఎంతో మనోధైర్యాన్ని ప్రసాదించినందుకు ఎస్ఎఫ్‌సి చైర్ పర్సన్ డీకే అరుణ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ. శరణయ్య స్వామి, రంగారెడ్డి, శాసమూల బాలప్ప, మహిపాల్ రెడ్డి, మల్లికార్జున్, మహిపాల్, బాలచందర్ రెడ్డి, మిస్కిన్ ప్రభు, ఆకుల వెంకటప్ప, గొడుగు లక్ష్మీనారాయణ, అంజప్ప, విశ్వనాథరెడ్డి, కాళేశ్వర మూర్తి, కర్ణ శీను, పాండు, నాగార్జున, ప్రవీణ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి

**నారాయణపేట ప్రతినిధి, జూలై22 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వము వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని చెప్పి భారతీయ జనతాపార్టీ కిసాన్ మోర్చా డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కి మెమోరండం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గెత్రం గోవర్ధన్ గౌడ్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింలు, భారతీయ జనతా పార్టీ నాయకులు నర్సింగ్ గౌడ్, బలరాం రెడ్డి, ఉదయభాను, రామచంద్రయ్య, ఉమేష్ కుమార్, నరసింహులు అన్న వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు : ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై22, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు పండుగ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆషాఢ మాసం బోనాలు పండుగ సందర్భంగాఆయన మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం, గొండ్యాల, చిర్మల్ కుచ్చుతాండాలలో జరిగిన బోనాలు పండుగకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయనఅమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శులు సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్ధారం సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులువి. మహేందర్, కార్యనిర్వహక అధ్యక్షులు చెన్నయ్య, మహిళా అధ్యక్షురాలు నవనీత, టంకర కృష్ణయ్య యాదవ్, రమేష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వేంకటాద్రి, రామకృష్ణ, నాయకులు వెంకటయ్య, లక్ష్మణ్‌నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని జమిస్తాపూర్ గ్రామానికి చెందిన రైతు చాకలి రాములమ్మ 50రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. అందుకు సంబంధించిన రైతు భీమా చెక్కును రాములమ్మ కుమార్తె నవ్యకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## గోకుల్‌నగర్, కొత్తపల్లి స్కూల్‌లను తనిఖీ చేసిన ఎంఈఓ

**మద్దూర్, జూలై 22 ప్రభాతవార్త:** ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని గోకుల్‌నగర్, కొత్తపల్లి స్కూళ్లను ఎంఈఓ ఆంజనే యులు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధన అందిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువు పరంగా ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని ఎంఈఓఆంజనేయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

■ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, హాజరైన శిక్షణ సర్వేయర్లు

**గద్వాల టౌన్ జూలై22, ప్రభాతవార్త:** లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణలో నేర్చుకున్న విషయాలను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమంగా రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు భూభారతి లైసెన్స్డ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థ వంతంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రెవెన్యూ, సర్వే విభాగాలు పరస్పరంగా అనుసంధానమై ఉన్నాయని, సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో సమర్థవంతమైన సేవలందించగలమన్నారు. భూమితి సాఫ్ట్‌వేర్ ద్వారా భూమికి సంబంధించిన సర్వేలు, మ్యాపింగ్, డేటా ప్రాసెసింగ్ వంటి సేవలను మరింత ఖచ్చితంగా, వేగంగా, ప్రజలకు చేరువగా అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ పొందిన 151 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు అధికారులచే మెయిల్‌ల నుండి డౌన్‌లోడ్ చేసి అందజేయడం జరిగిందని తెలిపారు. శిక్షణ పొందినఅభ్యర్థులకు తుది రాత పరీక్షలు జూలై 27న నిర్వహించనున్నట్లు, జూలై 2829న ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకొని, పరీక్షలను ఉత్తమంగా రాసి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా మారాలని సూచించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు లైసెన్స్‌డ్ సర్వేయర్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. అంతక ముందు సర్వే, ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామచందర్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించేందుకు అభ్యర్థులకు పిపిటి విధానం ద్వారా వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌చందర్, మండల సర్వేయర్లు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమలు నిర్వహించాలి

■ ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలి
■ సైబర్ మోసాలకు నెంబర్ 1930ను సంప్రదించాలి
■ నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట ప్రతినిధి జూలై22 ప్రభాతవార్త:** ప్రస్తుత సమా జంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజల ను మోసగి స్తున్న సందర్భంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తత తోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని తెలియ జేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందని ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడంవాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటిది సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్)లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్‌నేరస్తులు వినియో గిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్‌లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయ మాటలకు నమ్మి మోసపో కుండా ఉండాలని తెలిపారు. జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

## వైభవంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, జూలై22 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా బోనాల జాతర సందడి షురూ అయింది. అమ్మవారి ఆలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. మంగళవారం దేవరకద్ర మండలంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు నాగరాజు స్వామి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డికి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ సాంప్రదాయ బోనాల పండుగ శుభ సందర్భంగా దేవరకద్ర మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బోనాలు అనేది తెలంగాణ ప్రజల ఆరాధ్య దేవత, గ్రామదేవతలకు జరిపే పూజ. ఆషాడ మాసంలో గ్రామ దేవతలను శాంతింప చేయడానికి పంటలు బాగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ పండుగను జరుపుకుంటారని దేవరకద్ర ఎమ్మెల్యే అన్నారు. బోనాలు కేవలం పండగ మాత్రమే కాదు. ఇదొక సామూహిక వేడుక, ఊరంతా కలిసి అమ్మవారిని కొలిచి, పల్లకి సేవలు, పోతురాజు విన్యాసాలు, ఆడపడుచు నృత్యాలు, డప్పులశబ్దాలతో సందడిగా జరుపుకుంటారు. ఇది ప్రజలల్లో ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తుంది. బోనాల పండుగ భక్తిశ్రద్ధలకు సామూహికసంతోషానికి ప్రతీక అన్నారు. ఇది ప్రకృతితో మానవుడి సంబంధాన్ని వ్యవసాయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఈ శుభదినం అందరి జీవితాల్లో ఐశ్వర్యాన్ని విజయాలను తీసుకురావాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నాను అని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, వీరప్పయ్య చైర్మన్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జవహర్, మాజీ జెడ్పిటిసి లక్ష్మికాంత్‌రెడ్డి, వర్మ, చంద్రమౌళి, గోవర్ధన్‌రెడ్డి, నర్వ శ్రీనివాసరెడ్డి, గౌనిరాము, అంజన్ కుమార్‌రెడ్డి, ఉషనప్ప, రాంపండు, పూర్ణిత, అర్జునచారి, ఇనాయత్ అలీ, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, కౌకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, ఆంజనేయులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఖిల్లా బోనాల ఉత్సవాలలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



గంగమ్మ బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**ఖిల్లాగణపురం, జూలై22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని దస్తగిరిలో ఉన్న గంగమ్మ దేవత ఉత్సవాలలో మాజీ మంత్రి నిరంజ న్‌రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగల వల్ల గ్రామాలలో భక్తి ప్రతులు ఐకమత్యం కలిగి సోదర భావంతో మెలుగుతారని అన్నారు. పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, మాజీ ఎంపీటీసీలు కృష్ణయ్య గౌడ్ శెట్టి, గోపాల్, యాదగిరి, గోపాల్, సింగోటం భూమయ్య, బాల్‌రెడ్డి, చిన్న, ఆంజనేయులు గౌడ్, పెద్ద ఆంజనేయులు గౌడ్, క్యామ వెంకటేష్, పోలిశెట్టి ప్రతాప్ రాఘవేందర్ రెడ్డి, బాలరాజు కొండ, నాగులఆంజనేయులు, గుర్రం శ్రీనివాసులు, గోరేటి మహేష్, దవాఖాన సత్యనారాయణ, బుచ్చి బాబు గౌడ్, కొరియర్ శంకర్, బదులు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రవహిస్తున్న దుందుభి..



మొల్గర వద్ద ప్రవహిస్తున్న దుందుభి వాగు

**ఉప్పునుంతల, జూలై 22 ప్రభాతవార్త :** సోమవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షానికి మండలంలోని మొల్గర ఉల్పర గ్రామాల మధ్యదుందుభి ప్రవహిస్తుంది. మంగళవారం ఉదయం భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ప్రవహిస్తున్న దుందుభిని పరిశీలించి ఆనందాన్ని వెలిబుచ్చారు. కొంతమంది ఏకంగా వాగులోకి దిగిచేపలు పట్టుకున్నారు. దుందుభి వాగు ప్రవహిస్తుండడంతో ఇసుక రవాణాకు చెక్కు పడినట్లు అయింది.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు

**నారాయణపేట ప్రతినిధి జూలై 22 ప్రభాతవార్త:** కేజీబీవీ, కళాశాలలో ఫిజిక్స్, మాథ్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులను బోధించుటకు అతిథిఆధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్వేతజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, బీఈడీ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తులను నారాయణపేట కేజీబీవీలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అందించాలని ప్రిన్సిపల్‌తెలిపారు. పూర్తి వివరాలకు 9912989334 సంపదించాలన్నారు. నారాయణపేట జిల్లా కు చెందిన స్థానికత కలిగి ఉన్న అభ్యర్థులు మాత్రమే పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**దామరగిద్ద, జూలై 22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని33/11కేవీ లోకుర్తి ఉపకేంద్రం మరమ్మతు కారణంగా లోకుర్తి, పిడెంపల్లి, కందేనపల్లి, ఆశన్‌పల్లి, చకాల్వానిపల్లి, ఎల్సన్‌పల్లి గ్రామలకు ఉదయం 11గం. లనుండి మధ్యాహ్నం 3 గం. లవరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఇ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

## విద్యార్థి విద్యాభివృద్ధికి ఉప్పల ట్రస్ట్ చేయూత

**కల్వకుర్తి, జూలై 22 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల మార్చాల గ్రామానికి చెందిన ఇమ్మడి నారాయణ కుమారుడు ఇమ్మడి ధనుష్ ఇటీవల 10వ తరగతి పూర్తి చేసుకొని ఇంటర్మీడియట్ చదువుల కొరకై ఆర్థిక సహాయం కొరకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ను కోరారు. విద్యార్థి విద్యాభివృద్ధికి మంగళవారం ఉప్పల వెంకటేష్ హైదరాబాదులోని తన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు నిజాముద్దీన్ సమక్షంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. విద్యాభివృద్ధికి సహకరించిన ఉప్పల వెంకటేష్‌కు విద్యార్థి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అధిక వసూళ్లను అరికట్టాలి



దేవస్థాన చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న భజరంగ్ దళ్ నేతలు

**చిన్నచింతకుంట, జూలై 22 ప్రభాతవార్త :** స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల నుండి అధిక వసూళ్లను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు బజరంగ్ దళ్ పాలమూరు జిల్లా గోరక్ష ప్రముఖ సందీప్ నాయుడు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక వసూళ్లపై దేవస్థాన అధికారులు, పాలకమండలి సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని వినతిపత్రంలో కోరినట్లు వారు తెలిపారు. ఆలయంలో భక్తుల సమస్యలను దేవస్థాన చైర్మన్‌తో చర్చించామని ఆయన సానుకూలంగా స్పందించారని అని తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తామని చెప్పడం జరిగిందని సందీప్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల భజరంగ్ దళ్ నేతలురవి, సందీప్, రాజశేఖర్, నానికార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తు పొడిగింపు

**గద్వాల టౌన్ జూలై22, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నందు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కొరకు దరఖాస్తు తేదినీ ఆగస్టు31 వరకు పొడిగించినట్లు జిల్లాషెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకంలో ఈ విద్యా సంవత్సరం నుండి 210సీట్ల నుండి 500సీట్ల వరకు పెంచినందున. ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు వెబ్సైట్ నందు ఆగస్టు 31వ తేదీ వరకు సంబంధిత ధ్రువపత్రాలతోదరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని విద్యార్థిని/విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రకటన ద్వారా కోరారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వడ్డేపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** శాంతినగర్‌కు చెందిన వెంకటేష్ అనే వ్యక్తికి ఫేస్‌బుక్ ద్వారాఒక వ్యక్తి పరిచయమై ఆ వ్యక్తి చెప్పిన ప్రకారంగోల్డ్ బ్లాక్ చైన్ అనే యాప్‌లో డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేస్తే 20 బెనిఫిట్ వస్తుందని చెప్పగా అది నమ్మి వెంకటేష్ అనే వ్యక్తి యాప్ నందు ఎనిమిది లక్షల రూపాయలను డిపాజిట్ చేయడం జరిగింది. అతనికి అటు యాప్ నందు 34 లక్షలు క్రెడిట్ అయినట్టుగా యాప్‌లో చూపించింది. ఆ డబ్బులను డ్రా చేసుకుందామని అవతల వ్యక్తికిఫోన్ చేయగా వారు 15 లక్షలు టాక్స్ పడుతుంది. డబ్బులు పే చేయమని వారు అడగగా వెంకటేష్ అనే వ్యక్తి మోసపోయాడు అని గుర్తించి సైబర్ క్రైమ్ 1930 నెంబర్‌కి కాల్ చేయగా అతనికి రూ.40000వేలు హోల్డ్ అయినవి. ఫిర్యాదుపై శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై నాగశేఖరరెడ్డి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తుతెలియని యాప్‌లలో ప్రజలు డబ్బులు ఇన్వెస్ట్ చేయవద్దని కోరారు.

## అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేటప్రతినిధి, జూలై22 ప్రభాతవార్త:** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా విదేశాలలో చదువుటకు డిగ్రీ స్థాయిలో మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, సైన్స్, హుమానిటీస్ తదితర కోర్సులుపూర్తి చేసిన వారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో సంబంధిత కోర్సులను విదేశాలలో చదువగోరే ఎస్సి విద్యార్థినీ విద్యార్థులు నేరుగా ఈ పాస్ పోర్టల్‌లో ఏవోవియన్ స్కీంలో దరఖాస్తు ఆఘస్టు 31 వరకు చేసుకోవాలని, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కజ్జంఉమాపతి ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ ఆదాయం రూ.ఐదు లక్షలకు మించకుండాఉండాలని దరకాస్తుదారుల వయస్సు(35) సం.లోపు ఉండాలని, కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని డిగ్రీలో 60 మార్కులు కలిగి ఉండాలని, గుర్తింపు పొందిన విదేశీ విద్యాలయంలో అడ్మిషన్ పొంది ఉండాలని, జీఆర్ఈ, జీఎంటి, ఓఎఫ్ఈఐ, ఈఎల్ఎస్ నందు 60 మార్కులు కలిగిన వారు అర్హులని పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## స్థానిక సంస్థల్లో బిజెపి జెండా ఎగరాలి

**మానవపాడు, జూలై22 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గొంగళ్ల ఈశ్వర్ అన్నారు. మంగళవారం అలంపూర్ పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించుకునే విధంగా బిజెపి నాయకులు కృషి చేయాలని సూచించారు. అబద్దాలతో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కి వాటిని విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ యొక్క వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఫండ్స్‌తోనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. సిసీ రోడ్లు, వీధిలైట్లు వైకుంఠధామాలు ఉచితరేషన్ బియ్యం, విశ్వకర్మ యోజన, లేబర్ ఇన్సూరెన్స్ వంటి తదితర పథకాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రజలు ఆలోచించి బిజెపి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కన్వీనర్ రంగస్వామి ఎంపిటిసి ఇన్చార్జి జంగం నాగమల్లయ్య, అలంపూర్ టౌన్ ప్రెసిడెంట్ శరత్ బాబు, రాఘవేంద్ర, రమేష్‌రెడ్డి, మధురవాణి, నాగమద్దిలేటి, రాము, లక్ష్మణ్, రాజేష్, జగన్మోహన్ రెడ్డి, దాస నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ కాంపౌండ్‌లో మొరం వేయించిన కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, జూలై 22 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వర్షం వస్తే బురద అవుతుందని, అలాగే పిచ్చి మొక్కలు మొలచి కాంపౌండ్లో విద్యార్థులకు తిరగడానికి ఇబ్బందికరంగా ఉందని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మంగళవారం 10 ట్రిప్పుల మట్టిని కొట్టించి లెవలింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, బుర్రమోని రాములుయాదవ్, మోతే రాములు, నేష నరసింహ్మ, గొల్ల వెంకట్ రాములు, బొజ్జలమ్మ, జానమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

## మా ఇళ్ల స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

**చిన్నచింతకుంట, జూలై22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎదులాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 1 లో ప్రభుత్వ భూమి 1 ఎకరా భూమిలో నీరు పేదలకు గతంలో 2023 సం.లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి తహసిల్దార్ కృష్ణయ్య అర్హత ఉన్న 38 మంది లబ్ధిదారులకు అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చేతులమీదుగా ఇల్లా స్థలాల ప్రొసీడింగ్స్ కాపీలను ఇచ్చారు. ప్రస్తుతం ఆ సర్వే నెంబర్ 1 స్థలం లో కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని రాళ్ల పాతడం జరిగింది. ఈ విషయం పై మంగళవారం తహసిల్దార్ ఎల్లన్నను కలిసి గతంలో అర్హత ఉన్న 38 లబ్ధిదారులకు నష్టం కలగకుండా వారికే ఇళ్ల స్థలాలు అందించేలా చూడాలని కోరారు. 38 మంది నిరుపేదలకు న్యాయం చెయ్యాలని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు తహసిల్దారును కోరారు. లబ్ధిదారుల వినతిపై తహసిల్దార్ స్పందిస్తూ మీ గ్రామానికి ఆర్ఐను పంపించి విచారణ చేయిస్తానని లబ్ధిదారులకు తెలిపారు.

## ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

**గండీడ్ జూలై 22, ప్రభాతవార్త:** గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్య జయంతి ఘనంగానిర్వహించారు. దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పగిడాల్ బోరు కృష్ణయ్య మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్య ఉమ్మడి వరంగల్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో 1925 జులై 22 న జన్మించారనీ, ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించిరచయితగా, కవిగా సమాజాన్ని మేల్కొల్పారని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణ ఇంకా నిజం పాలనలో నరకం అనుభవించడాన్ని చూస్తూ భరించలేక తన అక్షరాలతో పోరు ప్రారంభించి ఆయన రచనలతో నిజాం పాలనకు వ్యతిరేకంగాపోరాటం చేసేలాఎందరినో ఉద్యమకారులను తయారు చేశారన్నారు. నిజాంను ధిక్కరించినందుకు ఆయనను జైల్లో ఉంచినప్పటికీ నిజాం పాలనకు భయపడకుండా ఆయన దిక్కర స్వరం ఆపకుండా జైలుగోడలపైనే తను రచనలు చేసిన గొప్ప ఉద్యమకారుడనీ, నా తెలంగాణకోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ఊతం అందించారని, తెలంగా ణకోసం దాశరథి కృష్ణమాచార్యులు చేసిన పోరాటపటి మను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, బి.మల్లేష్, కె.వెంకటయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్అండ్ఆర్ కమిషనర్‌తో కలసి మంత్రి సుడిగాలి పర్యటన

**ముంపు గ్రామ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా : మంత్రి వాకిటి శ్రీహరి**



అధికారులతో కలసి పర్యటన చేస్తున్న మంత్రి

**మక్తల్ టౌన్, జూలై 22 ప్రభాతవార్త :** మక్తల్ మండలం భూత్పూర్ గ్రామ పునరావాస కేంద్రాన్ని నీటిపారుదల శాఖ అధికారులతో కలసి ప్రత్యక్షంగా గ్రామ సమస్యలను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అడిగి తెలుకున్నారు. నవంబరు 24, 2022 నాడు త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక శుద్ధ తప్పుఅని ఆ నివేదికలో ఆస్తినష్టం, ప్రాణానష్టం లేదని తెలియజేయడం ఎంతవరకు సమంజస మని వారుప్రత్యక్షంగా వీక్షించిన ఉన్నతాధికారులను ప్రశ్నించడం జరిగింది. గత 15 సంవత్సరాల కాలం నుంచి ఈ గ్రామ ప్రజలు పడుతున్న బాధలను క్షుణ్ణంగా వివరించారు. వీలైనంత త్వరగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి,నీటిపారుదలశాఖ మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డికి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కె. కుర్మయ్య గౌడ్,రఘుపతిరెడ్డి,వాకిటి నాగప్ప భీమ్‌షేన్‌రావు, కే.బతలయ్య,రాఘవేందర్ రెడ్డి, కె. చెన్నయ్య గౌడ్, కుర్వనర్సింహ, లిక్కిభీమప్ప, గ్రామ ప్రజలు సంభందిత అధికారులు పాల్గొనడం జరిగింది.

## లయన్స్‌క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానం



లయన్స్‌క్లబ్ నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూలై 22 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ కల్వకుర్తి నూతన కమిటీని వాసవి క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు చిగుళ్ళపల్లి శ్రీధర్, కార్యదర్శి కలిమిచెర్ల గోపాల్,కోశాధికారి మిర్యాల శ్రీని వాస్‌రెడ్డిని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ గవర్నర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ రమేష్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ అధ్యక్షులు బాదం రాఘవేందర్ శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్‌క్లబ్ సేవలు మరింత ముందుకు తీసుకెళ్లాలని జూలూరు రమేష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో మాచిపెద్ది రవి, గుబ్బ కిషన్, జులూరు ప్రకాష్, మాచీ పెద్ది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు శుభవార్త

**కృష్ణ, జూలై22 ప్రభాతవార్త:** కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి శాలిని సూచించారు. మండలంలోని హిందూపూర్ గ్రామపచాయితీ పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యానిలయంలో 2025,26 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం పలుకుతున్నట్లుగా పాఠశాల ప్రత్యేక అధికారి మంగళవారం ఓ ప్రకటనలో తెలియపరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం10 సీట్లుఖాళీగా ఉన్నాయని తెలిపారు.ఈ ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వబడునని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**లింగాల, జూలై 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామానికి మంగళవారం నేషనల్ మానిటరింగ్ టిమ్ పర్యటించింది. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను మానిటరింగ్ టిమ్ సభ్యులు పరిశీలించారు.కేంద్రప్రభుత్వం గ్రామీణప్రాంతాలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా వివరాలనుతెలుసుకుని కేంద్రప్రభుత్వానికి నివేదికను ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ వెంకటప్రసాద్,ఎపిడి శ్రీనివాస్, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎపిఓ సీమామ్ అలీ,ఈసి శ్రీనివాసులు,ఎపిఎమ్ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు,సిసిలు పాల్గొన్నారు.

## అతిథి ఉపాధ్యాయ, అధ్యాపకుల కొరకై దరఖాస్తులు

**ఉట్కూరు, జూలై 22 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం పులిమామిడి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో అతిథి ఉపాధ్యాయ అధ్యాపకుల కొరకై అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్కూరు కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో సివిక్స్, నర్సింగ్, కామర్స్ బోధించేందుకు బీఈడీ, సంబంధిత సబ్జెక్టులో పీజీ పాఠశాల స్థాయిలో హిందీ, సోషల్ బోదించేందుకు ఏంఎ, బీఈడీ లేక హెచ్‌పీటీ డిగ్రీ అదే విధంగా పీఈటీ అర్హత బీపేడ్ గల జిల్లా స్థానికత కలిగి వున్న మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. జూలై 23 నుండి 26వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను కస్తూర్బా గాంధీ పాఠశాల ఉట్కూరులో దరఖాస్తులు అందించాలని కోరారు.

## సిగరెట్ల చోరీ కేసును ఛేదించిన పోలీసులు



ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**అయిజ జూలై22, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన సిగరెట్ల దొంగతనం కేసును పోలీసులు చేదించారు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు డీఎస్పీ మొగులయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కేసు వివరాలు వెల్లడిస్తూ అయిజ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన విజయ్ కుమార్ శెట్టి గత రెండు సంవత్సరాలుగా ఐజ పట్టణంలో విజయలక్ష్మి ఏజెన్సీని నడుపుతున్నట్లు తెలిపారు ఇందులో భాగంగానే 11వ తేదీన రాత్రి యధావిధిగా ఆయన షాపుకు తాళాలు వేసి స్వగృహంకి వెళ్లగా అదిగమనించిన దొంగల ముఠా 12వ తారీకు అర్ధరాత్రి సమయంలో షాపులోకి చొరబడి సుమారు 18 లక్షల విలువగల సిగరెట్ కాటన్లను దొంగలించినట్లు ఆయన తెలిపారు ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని తమ పోలీసు బృందం గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు ఇందులో భాగంగానే 21 తారీఖున కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు సమీపంలో దొంగల ముఠాను గుర్తించినట్లు తెలిపారు తమ బృందం వారిని అరెస్టు చేసి 15 లక్షలు విలువచేసే సిగరెట్ కాటన్లతో పాటు ఒక వాహనం రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న తెలిపారు ఇందులో ముగ్గురు నిందితులు ఉండగా ఇద్దరు అరెస్ట్ చేశామని ఇంకొకరు పరారీలో ఉన్నారని ఇంకొకరిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు అరెస్ట్ అయిన వారిలో ఎ1,నిందితుడు రతన్లాల్ 42 రాజస్థాన్ రాష్ట్రం ఎ 3,జగదీష్ 25 గల నిందితులను అరెస్ట్ చేసామని ఏ2 బీర్బల్ విష్ణు పరలో ఉన్నారని ఈ కేసును చాకచకంగా ఛేదించిన శాంతినగర్ సిఐ టాటా బాబును అయిజ ఎస్సై శ్రీనివాసరావును మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించి పోలీసులకు రివార్డులను అందించారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

**బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ**

**వనపర్తి రూరల్, జూలై 22 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు ఆదేశాల మేరకు మంగళవారం వనపర్తి మండలం నాగవరం తండాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై మండలస్థాయి కార్యశాలనిర్వహించడం జరిగింది.ఈ మండల కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపిక, గెలుపు కొరకు అనుసరించాల్సిన ప్రణాళికను కార్యాశాలలో దిశానిర్దేశం చేస్తూ పోటీ చేసే బిజెపి అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ప్రచారం కొనసాగించి, గ్రామాలలో ప్రతి ఇంటిలో ప్రచారంతో సంబంధం లేకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్నారనే విషయాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు.బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మద్దతుగా నిలబడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యశాలలో జిల్లా ఉపాధ్యక్షులు,స్థానిక ఎన్నికల మండల ప్రభారీ బండారు కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక ఎన్నికల మండల కన్వీనర్ జిల్లా అధికార ప్రతినిధి జిల్లా మీడియాఇన్చార్జి పెద్దిరాజు, స్థానికసంస్థల జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించండి

**మక్తల్ టౌన్, జూలై22 ప్రభాతవార్త:** మక్తల్ సమీపంలోని కాచ్వార్ గ్రామంలో ఇంటింటికి మాకు న్యాయం చేయండిఅనే కరపత్రాలను వినూత్ననిరసనను తెలియజేస్తున్నారు. నారాయణపేట కోడంగల్ భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వంపరిహారం చెల్లించుటకు రేటు నిర్ణయించుటకు న్యాయ నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు. 2013 భూసేకరణచట్టాన్ని అనుసరించిన అమలుచేయాలని ఇప్పటివరకు బలవంతంగా రైతుల నుండి భూసేకరణ కార్యక్రమాన్ని నిలిపివేస్తే బాగుంటుందని కోరుకుంటున్నారు. భూ నిర్వాసితులకు భూమికి బదులుగా భూమి, లేదా ఆమోదయోగ్యమైన న్యాయమైన పరిహారం ఇచ్చేవరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని ప్రభుత్వానికి ప్రజలు తెలియజేస్తున్నారు. కాచ్వార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**◆ నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికరెడ్డి ◆ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూలై 22 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ వరకు ఇల్లు నిర్మాణం చేపట్టుకున్న లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల బేస్మెంట్ బిల్లును మంగళవారం నారాయణపేట పట్టణంలోని 12వ వార్డులోచెక్కును అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంతో అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. నియో జకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఇల్లు నేర్పించుకున్న లబ్ధిదారులకు నిర్మాణాన్ని బట్టి బిల్లులు మూడువిడుదలగా అందజేయడం జరుగుతుందన్నారు.ఇండ్లు మంజూరైనలబ్ధిదారులు త్వరగానిర్మాణం చేపట్టి పూర్తి చేసుకో వాలని. ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణాన్ని బట్టి లబ్ధిదారులకు వారి అకౌంట్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని హౌజింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి సలీం, సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**దామరగిద్ద, జూలై22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి మండలానికి చెందిన నూతనంగా మంజూరైన రేషన్ కార్డులనులబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు కాలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేసిపంపిణీ చేయడం జరిగింది. కాంగ్రెస్ అంటేనే ప్రజల సంక్షేమ పార్టీ అని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి పథకాలు అమలుచేస్తామన్నారు.అడిషనల్ కలెక్టర్, ఎంపీడీవో, ఎంఆర్ఓ,మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభంశివకుమార్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి,పుట్టి ఈదప్ప,కనికిరెడ్డి, కాజామియా,ఆనంద్,లక్ష్మణ్, నీలిమానికప్ప,శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విగ్నేష్‌పూర్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



వెల్టూర్ నుండి విగ్నేష్‌పూర్ వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

**ప్పునుంతల, జూలై22 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు నుంచి విగ్నేష్‌పూర్ వెళ్లే రోడ్డును మంగళవారం టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. నల్గొండ జిల్లా డిండిప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న వంగూరు మండలం విగ్నేష్ పూర్ (చాకలి గుడిసె)ల గ్రామానికి వెళ్లడానికి ఉప్పునుంతల మండలం వెల్టూర్ నుంచి వెళ్లే అంతర్గత రోడ్డును పరిశీలించారు. వెంటనే పంచాయతీ రాజ్ అధికారులు సత్వరమే వెల్టూర్ నుంచి విగ్నేష్‌పూర్ వరకు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్ డివిజన్ అధికారిని చంద్రకళకు సూచించారు. రోడ్డు పరిశీలించిన వారిలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు డివిజనల్ పంచాయతీ అధికారిణి చంద్రకళ చంద్రకళ, ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల, ఏఈ మణిపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, స్థానికులు గోపిరెడ్డి వెంకటరెడ్డి, అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా దాశరథి శతజయంతి వేడుకలు



దాశరథి శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**జడ్చర్ల, జూలై22 ప్రభాతవార్త:** డా.బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "తెలుగు శాఖ" ఆధ్వర్యంలో "దాశరథి శతజయంతి" సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా " దాశరథి" చిత్రపటానికి వైస్ ప్రిన్సిపల్ నర్మద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ నర్మద మాట్లాడుతూ తెలంగాణ అభ్యుదయ కవి,సాహితీ వేత్తదాశరథి కృష్ణమాచార్యులు అగ్నిధార, రుద్రవీణ వంటి గ్రంధాల ద్వారా తెలంగాణా ప్రజలను చైతన్య పరిచారన్నారు.తెలుగు శాఖాధ్యక్షులు డా. నర్సింహులు మాట్లాడుతూ "నాతెలంగాణా కోటి రతనాల వీణ", "ముసలి నక్కకు రాచరికం దక్కునే" అంటూ నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నందుకు ఇందూర్ కోటలో అరవై రెండు రోజులపాటు జైలు శిక్ష అనుభవించినప్పటికీ నిజాంవ్యతిరేక కవిత్వంతో తెలంగాణా ప్రజలకు స్ఫూర్తిదాతగా నిలిచిన గొప్ప సాహితీ వేత్త దాశరథి అని అన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ వేముల శ్రీనివాసులు, అధ్యాపకులు రాఘవేంద్రా రెడ్డి,డా.కల్యాణి నరసింహారావు, సతీష్ రెడ్డి, డా.బి. వెంకటయ్య, డా.నాగలక్ష్మి, డా. నంద కిషోర్, నాగరాజు, లైబ్రేరియన్ ఆంజనేయులు "దాశరథి కవిత్వాన్ని" సమీక్షించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**బిజినేపల్లి, జూలై 22 ప్రభాతవార్త:** నిజాం ప్రభుత్వంపై నిప్పుల పైన కాగిన దండోర దరువై సమాజహితం కోసం సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్యం చేసిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. గంగారం ఉన్నత పాఠశాలలో ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యుల 101వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నశేఖర్,రాజప్ప, మహమ్మద్, అశోక్ కుమార్, కొములయ్య, ఊర్మిళ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా బోనాల వేడుకలు

**భూత్పూర్,జూలై22,ప్రభాతవార్త:**ఆషాడమాసం చివరి మంగళవారం అయినందున భూత్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని వెల్కిచర్ల,గోప్లాపూర్, రావులపల్లి,మొల్గరలలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.అమ్మలక్కలు,బాలికలు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ఘటాలను అందంగా అలంకరించి భారీగా ఊరేగింపు నిర్వహించారు.భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడోవార్డు గోప్లాపూర్‌లో మహిళలు భారీ సంఖ్యలో హాజరై ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులుపాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి మేకల సత్యనారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డితో పాటు బీజేపీ నుంచి పట్నం శ్రీశైలం,ఎంకంపల్లి మల్లేష్‌లు కాంగ్రెస్ నుంచిలక్ష్మారెడ్డి,లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి

**మక్తల్ టౌన్, జూలై22 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామం వద్ద గొర్రెల కాపరి గొర్రెను కాపాడపోయి బాలరాజు (47)అనే వ్యక్తి రైలు ఢీకొట్టి ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.గొర్రెల కాపరి గొర్రెలు కాస్తుండగా రైలు పట్టాల పైకి వెళ్ళిన గొర్రెలను తప్పించబోయిన వ్యక్తి ,కాచిగూడ నుండి కృష్ణకు వెళ్లే రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందడం జరిగింది.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ

**దామరగిద్ద, జూలై 22 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రం నందుగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోదాదాపుగా 300 మంది విద్యార్థులకుఉచితంగా లయన్స్ క్లబ్ నారాయణపేట లయన్స్ క్లబ్ దామరగిద్ద ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాల పంపిణీ లయన్ శివకుమార్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. బీద విద్యార్థులకు ఉచిత నోటి పుస్తకాలు ఇవ్వడం వల్ల ఎంత ఉపయోగంగా ఉంటుందని వక్తలు అన్నారు. అదేవిధంగా ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దామరగిద్ద జూనియర్ కళాశాల నందు మొదటి,రెండవ,మూడవ బహుమతులుగా 5000, 3000, 2000 ఈ విధంగా ర్యాంక్స్ తెచ్చుకున్న వారికి ఇస్తానని తెలియజేశారు. అలాగే లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ అధ్యక్షులు హరినారాయణబట్టడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నీట్ నందు అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు మొత్తంఖర్చు తానే భరిస్తానని తెలియజేశారు.అధ్యక్షులు బస్సురెడ్డి, కార్యదర్శి ఎం.అశోక్, కోశాధికారితిప్పన, చార్టెడ్‌ప్రెసిడెంట్ భీమయ్యగౌడ్ నారాయణపేట లైన్స్ క్లబ్ రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు రాష్ట్ర మంత్రి, దేవరకద్ర ఎమ్మెల్యే పర్యటన

**దేవరకద్ర, జూలై 22 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో నేడు రాష్ట్ర పశుసంవర్ధక యువజన క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి,దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూదన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12:15 నిమిషాలకు కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్‌షెడ్ శంకుస్థాపనకార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:00 గంటకు కౌకుంట్ల మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజా, గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణంకోసం నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమలలో పాల్గొని, తదనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అదేవిధంగా మధ్యాహ్నం 2:00 గంటలకు కౌకుంట్ల మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, తదనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. కార్యక్రమంలోచిన్నచింతకుంట, కౌకుంట్ల, దేవరకద్ర ,మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బిసి, ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీ, సేవాదళ్, యూత్‌కాంగ్రెస్,ఎన్ఎస్ యు ఐ,మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని,విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి కోరారు.

### విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ

**ఉట్కూర్, జూలై22 ప్రభాతవార్త:** మహమ్మద్ యూసుఫ్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచితఎడ్యుకేషనల్ కిట్స్ అందజేయడం జరిగింది. ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ మిల్లతే ఇస్లామ్యా హై స్కూల్ ఆయుష్య సల్ఫియా హైస్కూల్ మదర్స మహమ్మదీయ సల్ఫియా స్కూల్లో విద్యార్థులకు పంపిణఈ చేయడం జరిగింది. కార్యక్రమంలోమహమ్మద్ అర్ఫత్, సీనియర్ నాయకుడు మహమ్మద్‌ఇస్మాయిల్,టౌన్ అధ్యక్షుడు ఎంఐఎం, మహమ్మద్ జావిద్, అబ్దుల్ రషీద్, అబ్దుల్ కలీక్, వికార్ యూనుస్ పాల్గొన్నారు.

### పేదలకు చేయూతనివ్వడమే సియా ఫౌండేషన్ లక్ష్యం

**- సియా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ అంజద్**

**కల్వకుర్తి, జూలై 22 ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు చేయూతనివ్వడమే సియా ఫౌండేషన్ లక్ష్యమని సమాజ సేవలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని సియా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ అంజద్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడుగుల మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన సయ్యద్ రసూల్ కూతురు సయ్యద్ సమీరా గత ఏడాది 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణతతో పాస్ అయింది. పై చదువులు చదివించడానికి సయ్యద్ సమీరా తల్లి వద్ద ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న ఆమనగల్లు పట్టణ ముస్లీం మైనార్టీ నాయకులు నిరుపేద విద్యార్థిని పైచదువులకు ఆర్థిక చేయూతనివ్వాలని కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నాజీయా మక్బూల్‌కు సంప్రదించగా ఆయన ఈ విషయం సియా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ అంజద్‌కు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన సమీరా కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న సియా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ అంజద్ సమీరాకు ఇంటర్ మొదటి సంవత్సరంలో 30 వేల రూపాయల చెక్కు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేయడానికి మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని మాజీ కౌన్సిలర్ నాజీయా నివాసంలో 50వేల రూపాయల చెక్కును కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ సమక్షంలో సమీరాకు అందజేశారు. ఈ సందర్భంగా సియా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ అంజద్ మాట్లాడుతూ నిరుపేద ప్రజల సంక్షేమ అభివృద్ధితో పాటు విద్యా వైద్య సేవలే లక్ష్యంగా సియా ఫౌండేషన్ పనిచేస్తుందని అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సమీరా వైద్య చదువు పూర్తి చేసేంతవరకు పూర్తి చదువు ఖర్చులు సియా ఫౌండేషన్ యే భరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్ ఖాన్, ముస్లీం మైనార్టీ నాయకులు అయ్యుబ్ ఖాన్, ఇంతియాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, జహంగీర్, ఏజాస్, హఫీజ్‌లతో పాటు విద్యార్థిని తల్లి పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

### దేవాలయ నిర్మాణానికి విరాళం

**వెల్దండ, జూలై 22 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బాదేపల్లి లక్ష్మయ్య తనవంతుగా ఆలయ నిర్వాహకులకు రూ.10వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, శ్యాంపూరి అల్లాజి, భరత్, నరసింహ, కాశన్న, మల్లేష్ తదితరులు ఉన్నారు.

### ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

**వెల్దండ, జూలై 22 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలో ఇందిరమ్మ ఇండ్లపేరుతో జరిగే అక్రమ ఇసుకరవాణాను అరికట్టాలని కోరుతూ తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు మంగళవారం బైరాపూర్ మాజీ సర్పంచ్ దార్ల కుమార్, ఉపసర్పంచ్ రమేష్ గౌడ్‌లు కలిసి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇసుకను డంపింగ్ చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వెంటనే అరికట్టాలని తహసిల్దార్‌ను కోరినట్లు తెలిపారు.

### కొత్త రేషన్ కార్డులు పంపిణీ

**మద్దూర్, జూలై 22 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూర్ మండల పరిధిలోని కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించి 106 కొత్త రేషన్ కార్డులు కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకట్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జయరాములు నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వాళ్ళ విజయ్ కుమార్, రమేష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### బాల్య వివాహ చట్టాలపై అవగాహన

**మక్తల్ టౌన్, జూలై22 ప్రభాతవార్త:** మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికరత కేంద్రం జెండర్ ప్రత్యేక అధికారి నరసింహులు మాట్లాడుతూ బాల్య వివాహ చట్టాలపై అవగాహన కల్పించారు.అమ్మాయిలను రక్షిద్దామని అమ్మాయిలను చదివిద్దాం అనేలక్ష్యంతో ప్రతిఒక్కరూ చదువుకునే విధంగా చుడాలని అన్నారు. విద్య కోసం ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తూ, పిల్లల కోసం టోల్ ఫ్రీనెంబర్ 1098పని చేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు కుడా తమ పిల్లల క్రమ శిక్షణ, పిల్లల చదువు, పిల్లలకు సమయం కేటాయించాలని, పిల్లలను పనిలో పెట్టుకొని బాల కార్మికులుగా తయారు చేయకుండా, విద్యా నేర్పించే విధంగా చూడాలని, బేటి బచావో బేటి పడావో పథకం ఈ పథక ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నీతి అయోగ్ నరేష్, అనిత జెండర్ స్పెషలిస్ట్, హరి చంద్ర, జాగిర్, సులోచన, రాజేశ్వరి, కళాశాల బృందం పాల్గొన్నారు.

### మానవపాడు ఎంపీడీవోగా రాఘవులు

**మానవపాడు, జూలై 22 ప్రభాతవార్త:** మానవపాడు మండల నూతన ఎంపీడీఓగా రాఘవులు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బదిలీపై వచ్చిన అధికారికి శాలువా కప్పి సన్మానించారు. అందరి సమన్వయంతో మండల అభివృద్ధికి తోడ్పడుతానని ఎంపీడీవో అన్నారు. కాగా గతంలో మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించి భాస్కర్ బదిలీపై వెళ్లారు.ఈ కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షులు శేఖర్, జగ్గుల శ్రీనివాసులు, రవి బోరవెల్లి మద్దిలేటి, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### జోగులాంబ సన్నిధిలో మాజీ ఎంపీ వినోద్

**మానవపాడు, జూలై 22 ప్రభాతవార్త:** అలంపూర్ శ్రీ జోగులాంబ బాలబ్రమేశ్వర స్వామి ఆలయాలను బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీ వినోద్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సదర స్వాగతం పలికారు. అనంతరం జోగులాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఘనంగా పోచమ్మ బోనాల పండగ

**నవాబుపేట, జూలై22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోచూరు గ్రామంలో మంగళవారం గ్రామ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో బోనాల పండుగను వైభవంగా చేసి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించినైవేద్యం సమర్పించారు. ప్రతి ఇంటి నుండి మహిళలు బోనాలు డప్పు చప్పుళ్లతో భాజా భద్రంత్రీలతో యువకులు గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయానికి వచ్చి భక్తులు వారి దీప ధూప నైవేద్యాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

**- వర్షాల నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి**

**- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై22, ప్రభాతవార్త:** వర్షాకాలం లో భారీ వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. ఉరుములు, మెరుపులు వచ్చిన సమయంలో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద గానీ, సెల్ టవర్ల వద్దగానీ, చెట్ల కింద గాని ఆశ్రయించ రాదని, విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించ వచ్చని తెలిపారు. విద్యుత్ స్తంభాలను, స్టే వైర్ల ను తాకకూడదు. ఒక వేళ ఎవరైనా తాకి విద్యుత్ షాక్ బారిన పడ్డప్పుడు వారిని రక్షించడానికి విద్యుత్ ప్రవాహకాలైన లోహపు రాడ్లను ఉపయోగించకూడదని సూచించారు. చెట్ల కొమ్మలపై, వాహనాలపై, భవనాలపై తెగి పడ్డ తీగలు ఉన్నట్లయితే వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రెయినేజీ నీరు , నాలాలు పొంగి ప్రవహించే చోట,మ్యాన్ హోల్ ల వప్పిల్లలను గమనించి అటు వెళ్లకుండా జాగ్రవహించాలని తెలిపారు. ప్రజలు,ముఖ్యంగా చిన్న పిల్లలు వాగులు,వంకలు,నీటి ప్రవాహాలు,చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు.పాత ఇండ్లు, శిధిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భారీ వర్షాలు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు,అత్యవసర సహాయం,ఎటువంటి సమస్య ఎదురైనా కంట్రోల్ రూం నెంబర్ 08542241165 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### వారంలో ఒక్కరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని,ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతివారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జయ చంద్రమోహన్, డీఈవో గోవిందరాజులు, జీసీడీవో నర్మద, అధికారులు విద్యాసాగర్, యాదయ్య, ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.